క్లుప్తంగా

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఒక దివ్యాంగుడికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు ట్రైసైకిల్ అందజేశారు. షీలోహు చర్చి మినిస్ట్రీస్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ట్రైసైకిల్‌ను ఆయన దివ్యాంగుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు సహకరించాలి



రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం ఎంపీటీసీ-2 స్థానానికి త్వరలో జరిగే ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. ఎంపీటీసీ మలిరెడ్డి సూర్యావతి మృతితో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఎంపిక చేసి వాటిపై అభ్యంతరాలు స్వీకరించడానికి మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వీకే రాయపురంలో రెండు, బోయనపూడిలో ఒకటి పోలింగ్ బూత్‌లు ఉంటాయని ఎంపీడీఓ తెలిపారు. 2,681 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోవలసి ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీ-2 పేర్నిడి వెంకటరాయుడు, అడబాల చిట్టిబాబు, తాటికొండ అచ్చిరాజు, విత్తనాల వెంకట రమణ, మలిరెడ్డి వీరబాబు, బీవీ రమణ, మండల పరిపాలనాధికారి వీవీ సాయి బాబు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం

కొత్తపల్లి: బలభద్ర సుభద్రా సమేత జగన్నాథ స్వామి(మొండి జగ్గప్ప)దేవి భూదేవి సమేత సత్యనారాయణస్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. ఇతర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపల్లి ఎస్సై రాలిగేశ్వరావు భద్రతా ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి స్వామి వార్లకు పుష్పయాగం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మాడుగుల ఈశ్వరరావు తెలియజేశారు. గ్రామా సర్పంచ్ కంబాల మౌనిక, ఎంపీటీసీ అడ్డా పాప, వైఎస్సార్ సీపీ నాయకులు కారే శ్రీనివాస్, కంబాల లక్ష్మణ్‌రావు, అడ్డా త్రిమూర్తులు దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ప్రభంజనం, సంకల్పం నాటికలు

ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు



కళాకారుడు మేడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొండెవరంలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. మూడో రోజు పల్నాడు జిల్లా సాతులూరుకు చెందిన నడింపల్లి వెంకట సుబ్బారావు మెమోరియల్ వారు ప్రభంజనం, విశాఖపట్నానికి చెందిన జాస్మిన్ ఆర్ట్ కల్చర్ వారు సంకల్పం నాటికలను ప్రదర్శించారు. ఈ నాటిక పోటీల్లో పాల్గొన్న కళాకారులను వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ కమిటీ కళాపరిషత్ చైర్మన్ మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో సత్కరించారు.

భద్రతపై కార్మికులు దృష్టి పెట్టాలి



రాక్ సిరామిక్స్‌లో కార్మికులకు బహుమతులు అందజేసిన రాధాకృష్ణ

సామర్లకోట: ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు భద్రతపై దృష్టి సారించాలని ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ అన్నారు. స్థానిక రాక్ సిరామిక్స్‌లో నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫ్యాక్టరీలో కార్మికులకు నిర్వహించిన వివిధ పోటీలో విజేతలకు బహుమతులు అంద జేశారు. సేఫ్టీ మేనేజర్ బాలాజీ కార్మికులచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు శాశ్వత్‌కుమార్ మహాపాత్ర, రాజేంద్రసింగ్ మాన్, నటరాజ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడాళ్లూ.. మీకు జోహార్లు..!

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పిఠాపురం: అమ్మగా.. అమ్మాయిగా.. చెలియగా.. చెల్లాయిగా.. ఇంటిని నడిపే ఇంతులుగా.. ఊరిలో ఉద్యోగిగా.. పోరులో అధినేత్రిగా.. జాతిని నడిపే జానగా అన్నింటా మీరే.. ఆడాళ్లు మీకు జోహార్లు. మహిళ లేనిదే మహిలో లేదే వైభవం అది చాటేందుకే మరలా వచ్చింది మహిళా దినోత్సవం. వ్యవసాయం, వ్యాపారం, రాజకీయం, సేవా కార్యక్రమాలు, చదువు, ఉద్యోగం ఇలా ఒకటేమిటి అన్ని రంగాల్లోను తామేమి తీసిపోమని నిరూపిస్తున్నారు నారీ మణులు. కాడె చేత బూని పొలం బాట పట్టి వ్యవసాయంలో ఆదర్శ రైతులుగా నిలుస్తోంది కొందరైతే, వ్యాపారంలో తమకు తామే సాటని నిరూపించుకుంటున్నా మరి కొందరు. రైతే రాజు అనే నానుడిని తోసిరాజని రైతే రాణి అని కొత్త ఒరవడిని తీసుకొస్తున్నారు మహిళా రైతులు. పకృతి వ్యవసాయం చేస్తు తమదైన శైలిలో లాభాలనర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న పెట్టుబడితో వ్యాపారాలు ప్రారంభించి రూ.కోట్ల టర్నోవర్‌కు చేరుకుని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి వ్యాపార వేత్తలుగా గుర్తింపునొందారు. ఖాళీ సమయాలలో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సంగీతం, కళలు, విజ్ఞానం వినోదం వంటి అన్ని అంశాల్లోను నారీమణులు ముందడుగు వేస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవ అందిస్తున్న మహిళల మనో భావాలు.

రాజకీయ వేత్తగా సేవలందిస్తున్నా..



కౌన్సిల్ సమావేశాన్ని నడిపిస్తున్న గండేపల్లి సూర్యావతి

ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసింది. రాజకీయ పదవులలో అత్యధిక భాగస్వామ్యం కల్పించింది. దీంతో మాకు చాలా మందికి రాజకీయ పదవులు అలంకరించే అవకాశం వచ్చింది. తొలుత ఎటువంటి అనుభవం లేక పోవడంతో కొంత తడబడినా అతి తక్కువ కాలంలోనే పాలనా వ్యవహారాలు అలవర్చుకున్నా. సొంతంగా నిర్ణయాలు తీసుకుని పరిపాలన చేస్తు మరింత రాజకీయ అనుభవాన్ని సంపాదించే ప్రయత్నం చేస్తున్నా. ఒక మహిళగా రాజకీయంలో మనుగడ సాధించడం కష్టం కాదు అని నిరూపించగలుగుతున్నా.

– గండేపల్లి సూర్యావతి, మున్సిపల్ చైర్ పర్సన్, పిఠాపురం మున్సిపాలిటీ

ఎన్నో సేవా కార్యక్రమాలు



మామూలుగా గుడికి వెళ్లడం వేరు ఒక సేకురాలిగా గుడికి వెళ్లడం వేరని మేము సేవ చేయడం ప్రారంభించాకా తెలిసింది. దణ్ణం పెట్టుకుని మొక్కుబడులు ఇచ్చేసి వచ్చేస్తే మన వరకే తృప్తి మిగులుతుంది. కాని సేవ చేస్తే పది మందికి తృప్తి కలిగించడంతో పాటు మనకు ఎనలేని సంతృప్తి కలుగుతోంది. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నా.

–వడిసిలేటి సత్యవతి, చిత్రాడ శ్రీవారి భక్త బృందం సభ్యురాలు, పిఠాపురం

శాస్త్రవేత్తగా పరిశోధనలు చేస్తా



ప్రపంచానికి సవాల్ విసురుతూ వణికిస్తున్న అల్జీమర్స్ రోగ నివారణ కోసం పరిశోధనలు చేస్తా. ఈ వ్యాధి ఎందరో జీవితాలను ఛిద్రం చేస్తోంది. వైద్య రంగానికి సవాల్‌గా మారింది. ఈ వ్యాధి కారణాలను అన్వేశించి నివారణ, నిర్మూలనకు పరిశోధనలు చేయడమే నాధ్యేయం. ఇప్పటికే ఆ దిశగా పరిశోధనలు ప్రారంభించాను. నా తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహం నన్ను యువ శాస్త్రవేత్తగా ప్రపంచ దేశాలను ఆకర్షించేలా చేశాయి.

– ఈమని లక్ష్మీసౌమ్య, యువ శాస్త్రవేత్త, పిఠాపురం



తన పొలంలో పని చేస్తున్న అడపా రమాదేవి

ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా..

నేను మాడిూరిలో ఎకరం పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. గతంలో మగవాళ్లు చేసే వారు కాని వ్యవసాయం నేనెందుకు చేయలేననిపించి గత కొన్నేళ్లుగా వ్యవసాయం చేయడం ప్రారంభించా. ప్రభుత్వం ఆర్థిక సహకారంతో అధికారుల సూచనలు సలహాలతో వ్యవసాయం చేయడం వల్ల లాభాలు వస్తున్నాయి. నాకు సంతృప్తిగా ఉంది. ఎక్కడా ఇబ్బంది పడలేదు. ఇంటి పనులు చూసుకుని మిగిలిన సమయాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్నా. సొంతగా పని చేసుకోవడం వల్ల పెట్టుబడి కూడా తగ్గి లాభం ఎక్కువగా వస్తుంది.

–అడపా రమాదేవి, మహిళా రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

విద్యతోనే మహిళల అభ్యున్నతి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కనకదుర్గ

పిఠాపురం: విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లోను పురోగతిని సాధించగలరని, అందరూ తప్పనిసరిగా చదువుకోవాలని సీడీపీఓ సీహెచ్ కనకదుర్గ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుభాషిని అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకోని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ విద్య మహిళలకు ఆర్థిక భరోసానిస్తుందన్నారు. మహిళలకు రక్షణ కరువవుతున్న ప్రస్తుత తరుణంలో ఎవరికి వారే తమ ప్రవర్తన ద్వారా తమను తాము రక్షించుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అల్లు పుష్పలత, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో చరిత్ర సృష్టించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జాతీయ స్థాయిలో చరిత్ర సృష్టించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరు సాధించలేని ఘనత చేసి చూపించారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన సంధర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం పిఠాపురంలో సంబరాలు జరుపుకొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరిన నాయకులు మున్సిపల్ ఆఫీసు, మార్కెట్ సెంటర్ మీదుగా కోటగుమ్మం సెంటర్‌కు చేరుకుని అక్కడ విజయోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించడం ఒక ఎత్తు అయితే రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు రావడం ఒక చరిత్ర అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన పరిశ్రమలకు కల్పించే సదుపాయాలు అందరి ఇన్వస్టర్లను ఆకర్షించాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, నేతలు గండేపల్లి బాబీ, బొగలి బాబ్జి, తలిశెట్టి వెంకటేశ్వరరావు, బొజ్జా రామయ్య, కొత్తపల్లి బుజ్జి, రెడ్డెం జనార్ధన్, గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి, పచ్చిమళ్ల అప్పల రాజు, ఉమ్మిడి జాన్, ఆనాల సుదర్శన్ పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రముఖ ఆలయాల్లో దవులూరి పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో దవులూరి దొరబాబు పూజలు



మరిడమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న దొరబాబు

సామర్లకోట/పెద్దాపురం: నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రకటించడంతో దవులూరి దొరబాబు మంగళవారం ప్రముఖ ఆలయాల్లో పూజలు చేశారు. సామర్లకోట బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం జగన్ తనపై ఉంచిన నమ్మకంతోనే ముందుకు సాగుతున్నామన్నారు. నియోజకవర్గానికి చెందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఉంటే ఆ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. దొరబాబుకు ఆలయ చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ఈఓ డి నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం లభించింది. ఉపాలయాల దర్శనాల అనంతరం ఆయనకు పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం స్టేషన్ సెంటర్‌లోని షిర్డి సాయిబాబా ఆలయంలో ఆంజనేయస్వామి ఆలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను ఆధ్వర్యంలో 108 కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నయాం అహ్మద్, మెప్మా సీటీ మిషన్ మేనేజర్ సుజాత, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మోరంపూడి రంగనాయకులు, ఏఎంసీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు, వాలు తిమ్మాపురం ఆంజనేయ స్వామి, మిరపకాయల వీధి ఆంజనేయ స్వామి ఆలయాల్లో దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీ నారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గోపు మురళి, త్సలికి సత్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్రపు డెక్క తొలగింపు



సామర్లకోట వద్ద గుర్రపు డెక్క తొలగిస్తున్న కూలీలు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో నీటి ప్రవాహనికి అంతరాయం కలిగిస్తున్న గుర్రపు డెక్క తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'నీరు సాగేదెట్టా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ నాగేశ్వరరావు దీనిపై స్పందించి గుర్రపు డెక్క తొలగింపునకు ఏర్పాట్లు చేశారు. పంట కాలువల్లోకి నీటి ప్రవాహానికి, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలకు చెందిన ఫిల్టర్ బెడ్ చెరువులకు నీటి ప్రవాహం తగ్గి పొవడానికి ఈ గుర్రపు డెక్క అవరోధంగా మారింది. ఈ తొలగింపుతో నీటి ప్రవాహం పెరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు



పశువైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో సాక్షి దినపత్రిలో ఈనెల 5వ తేదీన 'కుక్కలున్నాయి పిక్కలు జాగ్రత్త' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ భాస్కరరావు, వాకతిప్ప పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ కుక్కల పునరుత్పత్తి జరగకుండా వ్యాక్సిన్ వేయాలని మండల పశువైద్యాధికారి పి.శ్రీమనారాయణమూర్తి వినతిపత్రం అందజేశారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

మున్సిపల్ ఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ



సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ

పిఠాపురం: నగర పంచాయతీలో పని చేసే ప్రతి సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, వారితో గౌరవప్రదంగా మెలగాలని మున్సిపల్ ఆర్డీ ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. ఆయన మంగళవారం గొల్లప్రోలు నగర పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నాలుగో నంబరు వార్డు సచివాలయాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతు పన్నుల వసూళ్లలో ప్రగతి సాధించాలన్నారు. రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని రోడ్లతో పాటు డ్రైన్లు తప్పనిసరిగా నిర్మించాలన్నారు. నిర్మాణాలను అడ్డుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్ సత్యనారాయణకు సూచించారు. 14వ ఆర్థిక సంఘం నిధులుతో చేపట్టే పనులు వేగవంతం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ రాంప్రసాద్ తదితరులున్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు



పైప్‌లైన్ లీకులను పరిశీలిస్తున్న కమిషనర్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ బెడ్ నుంచి వాటర్ ట్యాంకులకు వెళ్తున్న పైప్‌లైన్లకు మున్సిపల్ కమిషనర్ నయాం అహ్మద్, వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. ఉండూరు రోడ్డులో పైపులైన్ లీక్ కావడంతో జేసీబీతో రోడ్డును తవ్వి మరమ్మతులు ప్రారంభించారు.

సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా మేడిశెట్టి



సామర్లకోట: వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షునిగా మేడిశెట్టి వెంకటరమణ ఎన్నికయ్యారు. మాధవపటౖం గ్రామానికి చెందిన వెంకటరమణకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సూచన ఆ పదవిలో నియమించారు. ఈ మేరకు దొరబాబుకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీదేవికి సామూహిక వ్రతాలు

సామర్లకోట: స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయంలోని లక్ష్మీదేవికి మంగళవారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు అనంతరం అమ్మవారికి సామూహిక అభిషేకాలు జరిగాయి. అనంతరం గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

శాంతివర్ధనలో హోలీ సంబరాలు



శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో హోలీ జరుపుకొంటున్న విద్యార్థులు

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభా వంతుల పాఠశాలలో మంగళవారం హోలీ సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో ఈ సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా రంగులు చల్లుకుని సందడి చేశారు.

వైఎస్సార్ సీపీ జిల్లా పీఆర్ విభాగం అధ్యక్షుడిగా మోరంపూడి



రంగనాయకులను అభినందించిన దవులూరి

సామర్లకోట: వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మోరంపూడి రంగనాయకులు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మోరంపూడి రంగ నాయకులును అభినందించారు. దొరబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. దీనిలో భాగంగానే రంగనాయకులకు జిల్లా స్థాయి పదవి లభించిందన్నారు. రంగనాయకులు మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన దవులూరికి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ సీఎం కావడానికి, పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి



అధికారుల నుంచి పన్నుల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీ సత్యనారాయణరాజు

సామర్లకోట: మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూలు శాతం పెంచేలా సమీక్షించనున్నట్టు ఆర్డీ ఎస్.సత్యనారాయణరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం సామర్లకోట మున్సిపాలిటీని ఆయన తనిఖీ చేశారు. గతంలో బిల్ కలెక్టరు చేసే పనిని ప్రస్తుతం సచివాలయ అడ్మిన్ చేయడంతో పన్నుల వసూలు శాతం ఎక్కువగా ఉండాలన్నారు. మున్సిపాలిటీలో 70 శాతం మాత్రమే పన్నుల వసూలు ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్వో పూడి రవిబాబు నుంచి పన్నుల వసూళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీ విలేకర్లతో మాట్లాడుతూ పన్నుల వసూళ్లతోనే మున్సిపాలిటీల అభివృద్ధి ఉంటుందని చెప్పారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నయాం అహ్మద్, మేనేజర్ అచ్చుతరాజు తదితరులు పాల్గొన్నారు.